క్లుప్తంగా

క్షతగాత్రులకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం పిప్రి గ్రామానికి చెందిన ఖేడ్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, ఆమె భర్త మాజీ ఎంపీటీసీ చందర్ నాయక్ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సోమవారం వెళ్లి వారిని పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అక్రమ నిర్మాణాలు నేలమట్టం

పటాన్‌చెరు: అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటస్వామి హెచ్చరించారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నం.993లో అక్రమంగా నిర్మించిన మూడు ఇళ్ల నిర్మాణాలు, సర్వే నం.994 లో అక్రమంగా నిర్మించిన ఐదు బేస్‌మెట్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కూల్చివేతల్లో మున్సిపల్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోనాపూర్‌లో రూ.11 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, మార్కెట్ డైరెక్టర్ శివకుమార్ పాటిల్, నాయకులు ముగ్దుమ్ పటేల్, బక్కప్ప, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న రాజు రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన అంకం అశోక్ రూ.10 లక్షలకు స్మార్ట్ కాలర్ బీమా చేశాడు. ఇటీవల దురదృష్టవశాత్తు అతడు మృతి చెందడంతో నామినీగా ఉన్న భార్య అంకం లక్ష్మికి సోమవారం రూ.10 లక్షలకు సంబంధించిన చెక్కును ఖేడ్ ఎస్‌బీఐ జీవిత బీమా శాఖ మేనేజర్ రాజురెడ్డి అందజేశారు. చెక్కు అందజేసిన వారిలో ఎస్‌బీఐ లైఫ్ సీనియర్ ఏజెన్సీ మేనేజర్ అశోక్, లైఫ్ మిత్రలు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన గ్రామైక్య సంఘం సభ్యులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని నస్తీపూర్ వెలుగు గ్రామైక్య సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా స్వప్న, కార్యదర్శిగా మౌనిక, కోశాధికారిగా అక్షయ, సహాయ కార్యదర్శిగా గౌస్యా, ఉపాధ్యక్షురాలుగా పద్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సీసీ కల్పన మాట్లాడుతూ నూతన కార్యవర్గం మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు సువర్ణ, వీఓఏ ప్రవీణ్, గ్రూప్ లీడర్లు పాల్గొన్నారు.

గోశాలకు విరాళం



విరాళం అందిస్తున్న విజయ భాస్కర్ రెడ్డి

పటాన్‌చెరు: శంషాబాద్‌లోని సత్యం శివం సుందరం గోశాలకు పటాన్‌చెరు పట్టణానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డి రూ.51 వేల విరాళం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల నిర్వాహకులు నిర్వహణ ఇబ్బందిగా మారిందని చెప్పడంతో తన వంతు సహాయంగా రూ .51వేలు అందజేశానని తెలిపారు.

15న ఉచిత నేత్ర వైద్య శిబిరం

నారాయణఖేడ్: ఖేడ్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 15న గురువారం సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి సమస్యలు ఉన్న వారికి ఉచిత చికిత్స, అవసరం ఉన్న వారికి ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 96761 71527 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మిషన్ భగీరథకు మోక్షమెప్పుడు?

బృందావన్ కాలనీలో తాగునీటి కటకట

- పన్నులు చెల్లిస్తున్నా నీటి కనెక్షన్ ఇవ్వరా?
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు



జోగిపేటలోని బృందావన్ కాలనీ



11వ వార్డులో తవ్వి వదిలేసిన మిషన్ భగీరథ పైపులైన్ గుంతలు

జోగిపేట(అందోల్): ఇంటింటికీ తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన 'మిషన్ భగీరథ' పథకం జోగిపేట మున్సిపాలిటీలో మాత్రం అమలు కావడం లేదు. దీంతో ఏడేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం ఇంటి పన్నులు చెల్లిస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'బృందావన్ కాలనీ' ఏర్పడి సుమారు ఏడెనిమిదేళ్లు కావస్తోంది. ఇక్కడ సుమారు 80కి పైగా ఇళ్లు నిర్మించుకొని వెయ్యి మంది వరకు ప్రజలు నివసిస్తున్నారు.

నీటిని కొనుక్కుంటున్న కాలనీవాసులు

తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో కాలనీ వాసులు ప్రతి రోజు రూ.20 చొప్పున చెల్లించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైన్‌లను ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. కొందరు తమ ఇళ్ల వద్ద ఉన్న బోరు వాటర్‌ను శుద్ధి చేసుకొని తాగుతున్నారు. అప్పటి మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు తాగునీటి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు పలుసార్లు వినతిపత్రం సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు.

తవ్వారు.. వదిలేశారు

పట్టణంలోని 11వ వార్డు పరిధిలోకి వచ్చే జోగిపేట–డాకూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న కొత్త కాలనీకి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని అందించడానికి మున్సిపల్ అధికారులు గుంతలు తవ్వారు. కానీ ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. వేసవి కావడంతో నీటికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత పాలకవర్గం ఉన్న సమయంలో ఈ పనులు ప్రారంభించినా ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. అధికారులను పలుసార్లు అడిగినా సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు.

కాలనీకి నీరివ్వండి



జోగిపేటలోని బృందావన్ కాలనీలో 75కు పైగా ఇళ్లు ఉన్నాయి. ఇంకా మున్సిపల్ అధికారుల అనుమతితో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇంటి యజమానులు, అద్దెకు ఉన్న వారితో కలిపి సుమారుగా వెయ్యి మంది వరకు నివసిస్తున్నారు. మిషన్ భగీరథ పథకం కింద నీటిని పంపిణీ చేయాలని పలుసార్లు అధికారులకు వినతిపత్రం అందజేశాం. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతి రోజు తాగునీటిని కొనుక్కొని తాగుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటిని అందించాలి.

\- అల్లె శ్రీకాంత్, కాలనీ అధ్యక్షుడు

ప్రతిపాదనలు పెడతాం



కొత్తగా ఏర్పడిన వెంచర్ కావడంతో అప్పట్లో కేవలం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వలేదు. ప్రస్తుతం కాలనీ వాసులు అడుగుతున్నారు. వీటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరు కాగానే ఇంటింటికీ మిషన్ భగీరథ కనెక్షన్ ఇస్తాం.

\- తిరుపతి, కమిషనర్, జోగిపేట మున్సిపాలిటీ

వీరభద్రుడి ఆలయంలో హోమం



చండీహోమంలో పాల్గొన్న ఈవో శశిధర్

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కార్యనిర్వాణాధికారి శశిధర్ గుప్త ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చండీ హోమం, పూర్ణాహుతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడు ఆది గురువు



బుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: గౌతమ బుద్ధుడు ఆది గురువు, ప్రజ్వల వెలుగు, సామాజిక ఉద్యమకారుడని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఖేడ్ అంబేడ్కర్ భవన్‌లో గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. ప్రజా, దళిత సంఘాల బాధ్యులు మారుతి, భీం సేన, గాలయ్య, నారాయణ, నర్సింహులు, శివాజీ, నగేష్, సాయినాథ్, ఏక్‌నాథ్, తుకారాం పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జలమండలి ఎండికీ వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సింధు రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ సింధు రెడ్డి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీల్లో రూ.2కోట్లతో నిధులతో డ్రైనేజీ పైపులైన్‌ల కోసం ప్రతిపాదనలు చేశామన్నారు. మ్యాక్ సొసైటీ కాలనీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఒకేసారి చెల్లించినా తిరిగి బిల్లులు వస్తున్నాయని, వాటిని మాఫీ చేయాలని కోరామని తెలిపారు. ఇందుకు జలమండలి ఎండీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ సమావేశంలో టీఆర్‌ఎస్ నియోజకవర్గ కోర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి



మిర్జాపూర్(బి)ప్రభుత్వాస్పత్రిలో కేక్‌కట్ చేస్తున్న, ఆస్మా, నర్సులు

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆస్పత్రులకు వచ్చే రోగులకు నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఆస్మా అన్నారు. మండల పరిధిలోని మిర్జాపూర్(బి) ప్రభుత్వాస్పత్రిలో సోమవారం పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి నర్సులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోగుల పట్ల వారు చూపే శ్రద్ధ, ప్రేమ, అంకితభావం ఎప్పటికీ మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రియాంక, డాక్టర్ సబా, నర్సులు శ్యామల, చండీదేవి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



కల్హేర్: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో..

కల్హేర్ మండలంలో..

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ప్రపంచ నర్సుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జెబ, పవన్ కళ్యాణ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మానిక్యం, బాలమణి, రుక్మిణి, శాంత పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం ఎన్నిక



నర్సింలు
డివిజన్ అధ్యక్షుడు



నాగరాజు
కార్యనిర్వాహక అధ్యక్షుడు

జోగిపేట(అందోల్): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 యూనియన్ జోగిపేట డివిజన్ ఎన్నికలు సోమవారం జోగిపేటలోని డివిజన్ భవనంలో జరిగాయి. అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగగా సభ్యులు తమ ఓటు ద్వారా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.నర్సింలు, కార్యదర్శిగా యం.సాయిలు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎ.నాగరాజు, కోశాధికారిగా జనార్దన్ ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి రాష్ట్ర కంపెనీ కార్యదర్శి కే.భూపాల్ రెడ్డి, ప్రాంతీయ అధ్యక్షుడు డి.వీరయ్య, ప్రాంతీయ కార్యదర్శి పి. శ్రీకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు హెచ్ శ్రీనివాస్, లక్ష్మయ్య, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

గురుకుల ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

జిన్నారం (పటాన్‌చెరు): మండల కేంద్రం సమీపంలోని గిరిజన గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన బాలురు ప్రవేశాలు పొందేందుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. విద్యార్థులకు ఈనెల 15న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ హయత్‌నగర్‌లోని పీవీ టీజీ కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు బదిలీ ధృవీకరణ పత్రం, మెమో, స్టడీ సర్టిఫికెట్, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆరు ఆధార్ జిరాక్స్, 3 కలర్ ఫొటోలతో రావాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం

పుల్‌కల్(అందోల్): వారం రోజుల క్రితం అదృశ్యమైన మహిళ చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో కాలిపోయిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం... బస్వాపూర్ గ్రామానికి చెందిన జయమ్మ అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తోంది. ఈ నెల 6న అదృశ్యమైంది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే చేగుంట సమీపంలో మృతదేహం కనిపించింది. చేగుంట పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న పుల్‌కల్ పోలీస్‌లు అదృశ్యమైన జయమ్మ కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి శరీరంపై ఉన్న నగల ఆధారంగా గుర్తించారు. అయినా పోలీసులు శవం జయమ్మదా కాదా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

సంక్షిప్త వార్తలు

◆ పార్కులను అభివృద్ధి చేస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని బాలవిహార్ పార్కును మరింత అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. సోమవారం బాలవిహార్ పార్కును ఆమె అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కులో పూర్తి స్థాయిలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

◆ జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుకారాం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు అలీ, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, నాయకులు పీరయ్య, మశ్చేందర్ పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించింది. పట్టణ ట్రాఫిక్ సీఐ సుమాన్ కుమార్ వివరాల ప్రకారం... ఆదివారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాండ్ , జాతీయ రహదారి బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 10మందిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఎనిమిది మందికి రూ.1500, మిగతా ఇద్దరికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు.

◆ పోగొట్టుకున్న ఫోన్, నగదు అప్పగింత



నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్‌కు చెందిన నర్వ పండరి కల్హేర్ నుంచి ఖేడ్‌కు ద్విచక్రవాహనంపై వస్తుండగా సంజీవన్‌రావుపేట సమీపంలో రోడ్డుపక్కన ఫోన్, కొంత నగదు దొరికాయి. వాటిని తీసుకెళ్లి ఖేడ్ ఎస్సై మొగులయ్యకు అప్పగించాడు. వాటిని పోగొట్టుకు న్న కల్హేర్ మండలం కృష్ణాపూర్‌కు చెందిన కిష్టయ్య ఖేడ్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించి తన ఫోన్, నగదును పోగొట్టుకున్న విషయాన్ని వివరించగా అవి అతడివేనని నిర్ధారించి ఎస్సై వాటిని అందజేశారు. దొరికిన వాటిని అప్పగించి నిజాయితీ చాటుకున్న నర్వపండరిని ఆయన అభినందించారు.

◆ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కక్కర్‌వాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం మొదటి రోజు గణపతి పూజ, శాంతి హోమం, మహాయజ్ఞం, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. ఈ నెల 14న ఆలయంలో రామలింగేశ్వర, నంది విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

◆ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): మొల్కల పౌర్ణమి సందర్భంగా భక్తులు మక్తక్యాసారం ఆత్మానందాశ్రమంలో మదనానంద సరస్వతి స్వామి, శ్రీ భగవద్భక్త పరాగ పూజ్యపాద గురు రాజయోగి వెంకటస్వామి గురుమూర్తులకు ఆశ్రమ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం బుదేరా చౌరస్తా సమీపంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో శివలింగానికి పూజారి అయప్పస్వామి పూజలు చేశారు. పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

◆ వైభవంగా ఆలయ వార్షికోత్సవం

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని ఊట్ల గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు అయ్యప్ప స్వామికి ఉదయం 7:30 నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అలంకరణ మహా పడిపూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు జాంగిర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



కుస్తీపోటీల్లో తలపడుతున్న బాలిక



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

నారాయణఖేడ్: మండలంలోని తుర్కపల్లిలోని భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహబూబ్ నగర్ జిల్లా నుంచి వచ్చిన శిరీష, సంగీత, గీత, మహారాష్ట్ర నుంచి వచ్చిన పల్లవి పవార్ అనే నలుగురు బాలికలు పాల్గొని సత్తా చాటారు. బాలికలు బాలురతో కుస్తీపోటీల్లో పాల్గొని గెలుపొందారు. విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అమర జవాన్‌కు ఘన నివాళి



జిన్నారం : మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు, యువకులు

జిన్నారం (పటాన్‌చెరు): మండలం పరిధిలోని మాదారం గ్రామంలో అమరవీరుల స్తూపం వద్ద పటాన్‌చెరు నియోజకవర్గ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన మురళీ నాయక్ చిత్రపటానికి గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాలతో జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు యుద్ధంతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, గ్రామస్తులు దుర్గయ్య, గణేష్, రమణ సింగ్, రాజు గౌడ్, మల్లేష్, రామకృష్ణ, లింగం, రాజు, భాస్కర్, మహేష్, మహేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో..

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం వద్ద కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో దేశం కోసం పోరాడి అమరులైన వీర జవాన్‌లకు నివాళులర్పించి, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టీఎండీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, యువ చైతన్యం ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మహేష్ కుమార్, మణిరత్నం, సలహాదారులు వెంకన్న, శ్రీనివాస్, యువ చైతన్య కార్యవర్గ సభ్యులు జ్యోతి, సాయి, శేఖర్, సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వట్‌పల్లి(అందోల్): చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బోయిని మమత(35) వివాహేతర సంబంధం విషయం తెలిసి ఆమె తండ్రి, భర్త కలిసి ఇది మంచి పద్ధతి కాదని, మానుకోవాలని సూచించారు. దీన్ని మనసులో పెట్టుకొని ఈనెల 4న గుర్తు తెలియని విష పదార్థాన్ని సేవించింది. దీంతో వెంటనే ఆమెను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైద్రాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వారం రోజులపాటు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

మద్దూరు(హుస్నాబాద్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ ఆవిర్భావించిందని, వంద సంవత్సరాల నుంచి పేదల కోసం పోరాటం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్‌లు అన్నారు. మండలంలోని నర్సయపల్లిలో సోమవారం సీపీఐ రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ 44 కార్మిక చట్టాలను నాలుగు చట్టాలుగా చేసి బానిసలుగా చేసే కుట్ర చేస్తుందన్నారు.